క్లుప్తంగా

వెంకన్నకు ప్రత్యేక పూజలు



పెందుర్తి: స్థానిక వేంకటాద్రిపై శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే సుప్రభాత సేవ, ఆరాధన, బాలబోగం చేశారు. అనంతరం తోమాల సేవ జరిపారు. సహస్ర నామార్చన, రాజభోగం, సర్వ దర్శనాలు జరిగాయి. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అధిక సంఖ్యలో వచ్చిన భక్తుల కోసం వెంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు.

నేడు అడవివరంలో సత్తెమ్మ తల్లి పాదాల ప్రతిష్ట



సింహాచలం: అడవివరం గ్రామ పొలిమేర దేవత సత్తెమ్మ తల్లి పాదాల ప్రతిష్ట కార్యక్రమం ఆదివారం ఘనంగా జరగనుంది. ఈ విషయాన్ని ఆలయ గౌరవాధ్యక్షుడు గంట్ల శ్రీనిబాబు, అధ్యక్షుడు పి. వెంకటరావు శనివారం మీడియాకు తెలిపారు. గోపాలపట్నం నుంచి సింహాచలం వెళ్లే ప్రధాన రహదారిలో, బాలాజీనగర్‌కు సమీపంలో ఉన్న అమ్మవారి ఆలయ ప్రాంగణంలో ఈ పాదాల ప్రతిష్ట కార్యక్రమం ఉంటుందని వారు వెల్లడించారు. ఈ మార్గంలో ప్రయాణించే భక్తులు, ఆలయానికి నేరుగా వెళ్లలేని పరిస్థితుల్లో ఉన్నవారు సైతం, సమీపంలోనే కొలువుదీరిన అమ్మవారి పాదాలను దర్శించుకుని మొక్కులు తీర్చుకునేందుకు ఈ ఏర్పాటు చేస్తున్నట్లు వారు పేర్కొన్నారు. త్వరలోనే ఆలయ ప్రాంగణంలో శివుడి విగ్రహ ప్రతిష్ట కూడా ఉంటుందని వారు తెలిపారు.

జేఈఈలో లిఖిత్‌కు 6,854 ర్యాంక్



పరవాడ : నాయుడుపాలేనికి చెందిన వెంకట సాయి లిఖిత్ జేఈఈ మెయిన్స్‌లో జాతీయ స్థాయిలో ఓపెన్ కేటగిరీలో 6,854 ర్యాంక్, ఓబీసీ–ఎన్‌సీఎల్ కేటగిరీలో 1,452 ర్యాంక్ సాధించాడు. రాజమండ్రిలోని ఓ ప్రైవేట్ కళాశాలలో చదువుతున్న లిఖిత్ రోజుకు 16 గంటలు సాధన చేసి ఈ ఫలితం సాధించాడు. ముంబై ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ చదవాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు. తండ్రి విజయవాడ ఏపీ జెన్‌కోలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. తల్లి వెంకట లక్ష్మి గృహిణి. వెంకటసాయి లిఖిత్ సోదరుడు వెంకట భాను తేజ గుంటూరు వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ రెండో సంవత్సరం చదువుతున్నాడు.

టెక్నికల్ చానల్‌లోనే పదోన్నతులు కల్పించాలి



ఎంపీడీవో వెంకట్రావుకు వినతిపత్రం అందిస్తున్న గ్రామ సచివాలయాల డిజిటల్ అసిస్టెంట్లు

పెందుర్తి: గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న డిజిటల్ అసిస్టెంట్‌లు తమకు గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శులుగా కాకుండా టెక్నికల్ ఛానల్ ద్వారానే పదోన్నతులు కల్పించాలని కోరారు. ఈ మేరకు వారు శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కొల్లి వెంకట్రావుకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డిజిటల్ అసిస్టెంట్‌లు మాట్లాడుతూ, ప్రభుత్వం తమను గ్రేడ్–5 పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతి కల్పించేందుకు ప్రతిపాదనలు చేస్తోందని, అయితే ఇది తమ అర్హతలకు , అనుభవానికి పూర్తిగా విరుద్ధమని పేర్కొన్నారు. తాము సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన విధులు నిర్వహిస్తున్నందున, తమకు టెక్నికల్ విభాగం ద్వారానే పదోన్నతులు ఇవ్వాలని వారు విజ్ఞప్తి చేశారు.

స్నేహితుడికి అండగా..



అనారోగ్యంతో ఉన్న స్నేహితుడ్ని పరామర్శిస్తున్న పూర్వ విద్యార్థులు

పెందుర్తి: తమతో పాటు చదువుకుని ప్రస్తుతం తీవ్ర అనారోగ్యానికి గురైన వ్యక్తికి స్నేహితులు అండగా నిలిచారు. అతడి చికిత్స నిమిత్తం రూ.20 వేలు సమకూర్చారు. మండలంలోని గొరపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో చదివిన పూర్వ విద్యార్థులు (1992–93 బ్యాచ్) తమ స్నేహితుడు సొంటియ మురళీకృష్ణ అనారోగ్యానికి గురయ్యాడని తెలుసుకుని ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితిని తెలుసుకున్నారు. వైద్య ఖర్చుల నిమిత్తం రూ.20 వేలు అందించారు.

ఆర్భాటంగా ప్రారంభం.. ఆదరణ కరువు



రాయపుర అగ్రహారంలో నిరుపయోగంగా ఉన్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం

నిరుపయోగంగా చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు

మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకంలో నిర్మించిన కేంద్రాలు

మూలకు చేరిన ట్రై సైకిళ్లు

సబ్బవరం: మండలంలో గ్రామీణ పారిశుద్ధ్యం మెరుగుపరచడానికి, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడానికి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా 'చెత్త నుంచి సంపద' తయారీ కేంద్రాలను ఏర్పాటు చేసింది. సేకరించిన వ్యర్థాలను ఉపయోగించి ఆర్థిక వనరులను సృష్టించాలనే ఉన్నత లక్ష్యంతో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో ఈ కేంద్రాలు రూపుదిద్దుకున్నాయి. సేకరించిన చెత్తను వర్గీకరించి, దాని నుంచి లభించే ముడి పదార్థాలను విక్రయించడం ద్వారా గ్రామ పంచాయతీలకు ఆర్థికంగా చేయూత అందించాలనేది ప్రధాన ఉద్దేశం. కానీ, దురదృష్టవశాత్తు, ఈ కేంద్రాలు ప్రస్తుతం ఆయా గ్రామాలలో నిరుపయోగంగా, కేవలం అలంకారప్రాయంగా మిగిలిపోయాయి.

మండలంలోని అనేక గ్రామాల్లో ఈ 'చెత్త నుంచి సంపద' తయారీ కేంద్రాలు నిర్వహణ లేక అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయి. ప్రతి గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద నిర్మించిన ఈ కేంద్రాలలో ఒక స్టోర్ రూమ్, నీటి సౌకర్యం, మరుగుదొడ్లు , కేంద్రం చుట్టూ కంచె వంటి అన్ని రకాల వసతులు తప్పనిసరిగా ఉండాలి. అయితే, ప్రస్తుతం మండలంలోని చాలా గ్రామ పంచాయతీలలో ఈ ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రాలు ఉన్నప్పటికీ, సరైన వసతుల కొరత తీవ్రంగా వేధిస్తోంది. దీని కారణంగా, ఆయా కేంద్రాలకు చెత్తను తరలించి నిర్వహించే పరిస్థితి కనిపించడం లేదు.

నిధుల వృథా

గత తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో ప్రతి గ్రామంలోనూ 'చెత్త నుంచి సంపద' తయారు చేసే కేంద్రాలను మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించారు. ఒక్కో గ్రామ పంచాయతీలో సుమారు రూ. 3.5 లక్షల నుంచి రూ.6 లక్షల వరకు వెచ్చించి వీటిని అందుబాటులోకి తీసుకువచ్చారు. కేంద్రానికి అవసరమైన ఇతర వసతులను ఆయా గ్రామ పంచాయతీల నిధుల నుంచి ఏర్పాటు చేసుకోవాలని పంచాయతీలకు ఆదేశాలు జారీ చేశారు.

పంచాయతీ ఖాతాకు నిధుల జమ

గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించి, వచ్చిన చెత్తను తడి – పొడి చెత్తగా వేరు చేసి ఈ కేంద్రాలకు తరలిస్తారు. సేకరించిన తడి చెత్తను వర్మీ కంపోస్ట్‌గా తయారు చేసి గ్రామంలోని రైతులకు విక్రయించడం ద్వారా ఆదాయం పొందవచ్చు. అదేవిధంగా, పొడి చెత్తను వాటర్ బాటిల్స్, గాజు బాటిల్స్ వంటి వివిధ రకాలుగా విభజించి విక్రయించగా వచ్చిన మొత్తాన్ని పంచాయతీ ఖాతాకు జమ చేస్తారు. కేంద్రం యొక్క నిర్వహణలో భాగంగా వచ్చే ఆదాయం, ఖర్చులను ఆన్‌లైన్ విధానంలో నమోదు చేయాల్సి ఉంటుంది.

నిరుపయోగంగా ట్రాక్టర్లు, ట్రక్కులు

అంతేకాకుండా, మండలంలోని గుల్లేపల్లి, మల్లునాయుడుపాలెం, అసకపల్లి, అంతకాపల్లి వంటి పెద్ద గ్రామాల్లో చెత్తను కేంద్రాలకు తరలించడానికి ప్రభుత్వం ట్రాక్టర్లను కూడా సమకూర్చింది. సుమారు రూ. 6 లక్షల నిధులతో ట్రాక్టర్లను అందించగా, అదనంగా మరో రూ. 2.5 లక్షలు వెచ్చించి పంచాయతీ నిధుల నుంచి ట్రక్కులను కొనుగోలు చేసి చెత్త తరలింపునకు అందుబాటులోకి తీసుకువచ్చారు. అయినప్పటికీ, ప్రభుత్వం కేంద్రాల నిర్వహణకు కావలసిన మరిన్ని వసతులు, సమర్థవంతమైన చెత్త సేకరణపై ప్రత్యేక దృష్టి సారించకపోవడంతో, ఈ విలువైన సాధనాలు కూడా నిరుపయోగంగా మారుతున్నాయి.

మండంలోని పంచాయతీలు	24
చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలు	24
ఒక్కో కేంద్రం ఏర్పాటుకు వెచ్చించిన నిధులు	రూ. 3.5 – రూ.6 లక్షలు
గ్రీన్ అంబాసిడర్లకు చెల్లిస్తున్న ఒక్కొక్కరి వేతనం	రూ.6 వేలు
మొత్తం అంబాసిడర్లు	87 మంది

కానరాని 'గ్రీన్ అంబాసిడర్లు'

గతంలో ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించేందుకు అప్పటి ప్రభుత్వం 'గ్రీన్ అంబాసిడర్ల'ను నియమించింది. గ్రామంలోని ప్రతి 250 కుటుంబాలకు ఒక గ్రీన్ అంబాసిడర్‌ను నియమించారు. వీరంతా ఇంటింటికీ వెళ్లి చెత్తను సేకరించి, వచ్చిన చెత్తను తడి–పొడి చెత్తగా వేరు చేసి వారికి ఇచ్చిన ట్రై సైకిళ్లపై కేంద్రానికి తరలించే బాధ్యతను అప్పగించారు. వీరిలో కొందరు కేంద్రం వద్ద నిర్వహణ బాధ్యతలు చూసుకునేందుకు 'గ్రీన్ గార్డ్'గా కూడా విధులు నిర్వహించేవారు. అయితే, ప్రభుత్వం వీరికి అరకొర జీతాలు, అంటే నెలకు కేవలం రూ. 6 వేలు మాత్రమే చెల్లించడంతో చాలామంది విధులకు దూరంగా ఉంటున్నారు. మండలంలోని సుమారు 87 మంది గ్రీన్ అంబాసిడర్లు విధుల్లో ఉన్నట్లు అధికారులు లెక్కలు చెబుతున్నప్పటికీ, వారి సేవలు ప్రస్తుతం మండలంలో ఎక్కడా కనిపించడం లేదు. వారికి ఇచ్చిన ట్రై సైకిళ్లు ప్రస్తుతం మూలకు చేరాయి. వీరిలో ఎక్కువ మంది గ్రీన్ అంబాసిడర్లు వృద్ధాప్యంలో ఉండగా, అవసరమైన మరికొంత మందిని నియమించేందుకు అధికారులు ప్రయత్నిస్తున్నప్పటికీ, చెల్లించే అరకొర వేతనాలకు ఎవరూ ముందుకు రావడం లేదని అధికారులు నిస్సహాయత వ్యక్తం చేస్తున్నారు.



సబ్బవరంలో అలంకారప్రాయంగా మారిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం



వృథాగా వర్మీ కంపోస్ట్ తయారు చేసే తొట్టి

కనీస వేతనాలు చెల్లించాలి



పారిశుద్ధ్య కార్మికులుగా పనిచేయడానికి తగినంత మంది ముందుకు రావడం లేదు. ప్రస్తుతం గ్రీన్ అంబాసిడర్లుగా పనిచేస్తున్న వారికి సైతం కేవలం రూ. 6 వేలు మాత్రమే వేతనం చెల్లిస్తున్నారు. ఈ తక్కువ వేతనం కారణంగా ఆసక్తి ఉన్నవారు కూడా పనిచేయడానికి వెనుకాడుతున్నారు. కార్మికులకు కనీస వేతనాలు చెల్లిస్తే, ఈ పరిస్థితిలో మార్పు వచ్చే అవకాశం ఉంది.

–ఉప్పాడ సత్యవతి, కార్మిక సంఘం నేత, సబ్బవరం మండలం

పారిశుధ్య నిర్వహణకు ప్రాధాన్యం



కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పారిశుద్ధ్య నిర్వహణకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయి. ప్రస్తుతం చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలలో వర్మీ కంపోస్ట్ తయారీ జరుగుతోంది. అయితే, గ్రీన్ అంబాసిడర్లగా పనిచేయడానికి ఆశించినంత స్పందన లేదు. కేంద్రాలలో అవసరమైన అన్ని రకాల వసతులను కల్పిస్తాం. అంతేకాకుండా, స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర కార్యక్రమంలో భాగంగా, మరమ్మతులకు గురైన ఎలక్ట్రానిక్ వస్తువులను ఎక్కడబడితే అక్కడ పారేయకుండా సేకరిస్తున్నాం.

బి. పద్మజ, ఎంపీడీవో, సబ్బవరం

చోరీ సొత్తు స్వాధీనం.. నిందితుడి అరెస్టు



మాట్లాడుతున్న పరవాడ డీఎస్పీ విష్ణు స్వరూప్, సీఐ మల్లికార్జునరావు



నిందుతుడి నుంచి స్వాధీనం చేసుకున్న బంగారు, వెండి ఆభరణాలు

పరవాడ : పరవాడ మండలం సంతబయలులో ఈ నెల 15న జరిగిన చోరీ కేసును పోలీసులు ఛేదించారు. పరవాడ డీఎస్పీ వి. విష్ణు స్వరూప్ శనివారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. లాలం రమణమ్మ అనే మహిళ ఇంటి తాళాలు పగులగొట్టి గుర్తు తెలియని వ్యక్తులు బంగారు, వెండి ఆభరణాలు, నగదు దొంగిలించినట్లు ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. అచ్యుతాపురం మండలం తిమ్మరాజుపేటకు చెందిన ఎస్. జగ్గప్పారావును పరవాడ మండల కాంప్లెక్స్ కూడలిలో అరెస్టు చేసి, అతని నుంచి 8 తులాల బంగారం, 20 తులాల వెండి ఆభరణాలు, రూ. 32 వేలు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ తెలిపారు. కేసును ఛేదించిన పోలీసులను డీఎస్పీ అభినందించారు. సమావేశంలో పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు, ఎస్ఐలు బి.కృష్ణారావు, మహాలక్ష్మి, బి.వై.నాయుడు, హెచ్‌సీ సాయి సంతోష్, పోలీసు సిబ్బంది నాగేంద్ర, నాయుడు పాల్గొన్నారు.

విద్యార్థి మృతికి సంతాపం

సబ్బవరం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బీఏ మొదటి సంవత్సరం చదువుతున్న కర్రి అప్పనాయుడు ఆత్మహత్య చేసుకోవడంతో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి. సీతాలక్ష్మి, అధ్యాపకులు, విద్యార్థులు శనివారం సంతాపం తెలిపారు. రెండు నిమిషాలు మౌనం పాటించి, విద్యార్థితో తమకున్న జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విద్యార్థులకు ఆత్మహత్యల పర్యవసానాల గురించి వివరించారు. యుక్త వయస్సులో కలిగే వ్యామోహం ప్రేమ కాదని, చదువు అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతుందని తెలిపారు. విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలని కోరారు. ఒక మరణం కుటుంబానికి, స్నేహితులకు, సమాజానికి తీరని లోటన్నారు. విద్యార్థులు ఇలాంటి నిర్ణయాలు తీసుకోకూడదని హితవు పలికారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు డాక్టర్ వీవీ గోపాలకృష్ణ, డాక్టర్ ఎం.రత్నప్రకాష్, ఎం. గోవిందరావు, కె. ప్రభుదాసు పాల్గొన్నారు.


పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం



మాట్లాడుతున్న ఎంపీపీ బోకం సూర్యకుమారి

సబ్బవరం: పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమవుతుందని, ప్రతి ఒక్కరూ తమ రోజువారీ ఆహారంలో చిరుధాన్యాలకు ప్రాధాన్యత ఇవ్వాలని సబ్బవరం ఎంపీపీ బోకం సూర్యకుమారి అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించిన మండల స్థాయి పౌష్టికాహార పక్షోత్సవాల కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ, గర్భిణులు తప్పనిసరిగా పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా పుట్టబోయే శిశువు ఆరోగ్యంగా జన్మిస్తాడని తెలిపారు. అనంతరం, కార్యక్రమంలో గర్భిణులకు సామూహిక శ్రీమంతాలు నిర్వహించారు. చిన్నారులకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి కె. రమామణి, ఎంపీడీవో పద్మజ, ఐసీడీఎస్ సీడీపీవో లలిత కుమారి, తహసీల్దార్ బి. చిన్నికృష్ణ, ఎంఈవో–2 కె. రవీంద్రబాబు, ఎంహెచ్ఈవో స్వర్ణలత, వైస్ ఎంపీపీ మామిడి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తం



మాట్లాడుతున్న సీపీ బాగ్చి. చిత్రంలో డాక్టర్ సీతా మాణిక్యం

మహారాణిపేట: సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసు కమిషనర్ శంకబ్రత బాగ్చి అన్నారు. శనివారం ఆంధ్రా విశ్వవిద్యాలయం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ లా కాలేజీలో జరిగిన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాల దుర్వినియోగం, మహిళలపై జరిగే సైబర్ నేరాలపై ప్రసంగించారు. సైబర్ నేరాలు జరుగుతున్న విధానం, సైబర్ నేరాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను విద్యార్థులకు తెలిపారు. డాక్టర్ అంబేడ్కర్ లా కాలేజీ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కె. సీతామాణిక్యం అధ్యక్షత వహించిన ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ జి.రాఘవయ్య, ప్రొఫెసర్ వి.రాజ్యలక్ష్మి, ప్రొఫెసర్ ఎ.పద్మావతి, ప్రొఫెసర్ ఎస్.బి. చంద్రకళ, డాక్టర్ కె.పల్లవి, న్యాయ, సిట్ విభాగాల నుంచి అనేక మంది విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్టీపీ సెంటర్ సందర్శన

ఆరిలోవ: బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్.సత్యనారాయణ శనివారం ఆదర్శనగర్‌లోని ఎస్టీపీ సెంటర్‌ను సందర్శించారు. దీని భవనంపై అదనపు అంతస్తు నిర్మించడానికి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ సంక్షేమ శాఖ ద్వారా కాపు, బీసీ, ఈడబ్ల్యూఎస్ కులాలకు చెందిన మహిళలకు స్వయం ఉపాధి పొందే అవకాశం కల్పిస్తున్నట్లు తెలిపారు. దీని ద్వారా మహిళలు భవిష్యత్‌లో ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఎదిగే అవకాశం కలుగుతుందన్నారు.

పారిశుధ్యానికి పెద్దపీట



రైతు బజార్‌లో రైతులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న ఈవో షర్మిల



ఉద్యోగులతో స్వచ్ఛాంధ్ర ప్రతిజ్ఞ చేయిస్తున్న ఈవో సుబ్బారావు



ర్యాలీ నిర్వహిస్తున్న హెచ్ఎం సన్యాసిరావు, విద్యార్థులు



ప్రతిజ్ఞ చేస్తున్న సర్పంచ్ వరలక్ష్మి సీతారామయ్య, మాజీ ఎంపీటీసీ శ్రీరామ్మూర్తి

పెందుర్తి: పంచాయతీలో పారిశుధ్యానికి పెద్దపీట వేస్తున్నామని పెదగాడి సర్పంచ్ కేసుబోయిన లావణ్య త్రినాథ్ అన్నారు. పెదగాడిలో శనివారం 'స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పంచాయతీ ప్రజలు ప్లాస్టిక్‌ను పూర్తిగా విడనాడాలని కోరారు. పర్యావరణానికి మేలు చేసే నూలు, క్లాత్ బ్యాగులు వాడాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ నిషేదంపై రూపొందించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యదర్శి మూర్తి, అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. పెందుర్తి పోలీస్ స్టేషన్ ఆవరణలో సీఐ కేవీ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో శ్రమదానం చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను శుభ్రం చేశారు. ముందుగా స్వచ్ఛ భారత్ ప్రతిజ్ఞ చేశారు. పెందుర్తి రైతుబజార్ ఆవరణలో ఈవో పద్మావతి షర్మిల ఆధ్వర్యంలో రైతులు శ్రమదానం చేశారు. బజార్‌లో ప్లాస్టిక్‌ను పూర్తిగా నిషేధిస్తున్నట్లు ఈవో తెలిపారు.

పర్యావరణాన్ని కాపాడుకుందాం

సింహాచలం : సింహాచలం కొండపై శనివారం 'స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఆలయ రాజగోపురం వద్ద ఈవో కె. సుబ్బారావు దేవస్థానం ఉద్యోగులు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ స్వచ్ఛాంధ్ర ఉద్యమంలో పాల్గొని పర్యావరణాన్ని కాపాడాలని పిలుపునిచ్చారు. ప్రకృతి ప్రసాదించిన సంపదను పరిరక్షించుకోవాలని సూచించారు. తడి, పొడి, రసాయన వ్యర్థాలను వేర్వేరుగా వేయడంపై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో రాధ, ఏఈవో ఆనంద్‌కుమార్, శానిటేషన్ పర్యవేక్షణ అధికారిణి రాజ్యలక్ష్మి, శానిటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలో 'స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర'

సింహాచల్‌నగర్‌లోని ఎంపీపీ పాఠశాలలో శనివారం 'స్వర్ణ ఆంధ్ర – స్వచ్ఛ ఆంధ్ర' కార్యక్రమం ఉత్సాహంగా జరిగింది. పర్యావరణ పరిరక్షణపై అవగాహన కలిస్తూ విద్యార్థులు గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పరిశుభ్రతే ప్రగతికి మార్గమని ప్రధానోపాధ్యాయుడు సన్యాసిరావు ఉద్ఘాటించారు. తడి, పొడి చెత్త వేరు చేయడంపై అవగాహన కల్పించారు. అనంతరం బడి ఈడు పిల్లలను పాఠశాలకు పంపాలని కోరుతూ 'బడి బాట' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీదేవి, రేఖ, పూర్ణకుమారి పాల్గొన్నారు.

పరవాడలో

పరవాడ: మండలంలోని నాయుడుపాలెం గ్రామంలో శనివారం నిర్వహించిన స్వర్ణాంధ్ర– స్వచ్ఛాంధ్ర కార్యక్రమానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కూండ్రపు వరలక్ష్మి సీతారామయ్య, మాజీ ఎంపీటీసీ కూండ్రపు శ్రీరామ్మూర్తి, పంచాయతీ కార్యదర్శి త్రినాథ్ , సచివాలయ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం వీరంతా కలిసి గ్రామంలోని ప్రధాన వీధులను శుభ్రం చేశారు. కార్యక్రమంలో నాయకులు, అధికారులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొని స్వచ్ఛత కోసం ప్రతిజ్ఞ చేశారు.


మహిళా కళాశాల ప్రిన్సిపాల్‌కు పూర్తి బాధ్యతల అప్పగింత



ప్రిన్సిపాల్ మంజులను అభినందిస్తున్న కళాశాల అధ్యాపక బృందం

డాబాగార్డెన్స్: విశాఖ జిల్లా భీమునిపట్నం ఎస్‌వీఎల్ఎన్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉన్న డాక్టర్ ఆర్. మంజులకు విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు అదనపు బాధ్యతలు అప్పగించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆమెకు విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా పూర్తి బాధ్యతలు అప్పగిస్తూ కమిషనర్ ఆఫ్ కాలేజియేట్ ఎడ్యుకేషన్ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని కళాశాల వైస్ ప్రిన్సిపాల్ వై. లక్ష్మి, ఇతర అధ్యాపక బృందం, అధ్యాపకేతర సిబ్బంది ఆమెను అభినందించారు.

ఏయూ రోప్ స్కిప్పింగ్ మహిళా జట్టు ఎంపిక



మహిళా జట్టుతో ఏయూ వ్యాయామ విద్యా విభాగాధిపతి పల్లవి

మహారాణిపేట: ఆంధ్రా యూనివర్సిటీ మహిళా రోప్ స్కిప్పింగ్ జట్టు ఎంపిక శనివారం జరిగింది. ఈ నెల 22 నుంచి 24 వరకు రాజస్థాన్ మాధవ్ యూనివర్సిటీలో ఆల్ ఇండియా యూనివర్సిటీ మహిళల రోప్ స్కిప్పింగ్ పోటీలు జరుగుతాయని ఏయూ వ్యాయామ విద్యా విభాగాధిపతి ఆచార్య ఎ.పల్లవి తెలిపారు. జట్టు కోచ్‌గా ఎం.ఉదయ్‌కుమార్ వ్యవహరిస్తారన్నారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన



అగ్ని ప్రమాదాలపై అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

సబ్బవరం: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా సబ్బవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం అగ్నిమాపక సిబ్బంది అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆసుపత్రి వైద్య సిబ్బందితో పాటు చికిత్స కోసం వచ్చిన ప్రజలకు అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. స్థానిక అగ్నిమాపక అధికారి జీవీ సత్యరాజు ఆసుపత్రిలో సంభవించే అగ్ని ప్రమాదాల గురించి వివరించారు. తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలను ప్రాక్టికల్‌గా చేసి చూపించారు. అంతేకాకుండా, అగ్ని ప్రమాదాల సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలకు సంబంధించిన కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ విద్యాధరి, డాక్టర్ ఆశా, సిబ్బంది కె. జేసుదాసు, ఎస్. రాజశేఖర్, పీడీవీ రత్నకుమార్, లీడింగ్ ఫైర్‌మన్ కె.ఎల్లాజీ, డీవోపీ ఎం.శ్యామ్ కుమార్, బి. ఉదయకుమార్, సీహెచ్. బెనహర్ తదితరులు పాల్గొన్నారు.

'బి హైగ్రేడ్' కూచిపూడి నృత్యకారిణిగా లిపికారెడ్డి



బీచ్‌రోడ్డు: హైదరాబాద్ దూరదర్శన్ కేంద్రం ఇటీవల కూచిపూడి నృత్య కళాకారులకు ఆడిషన్స్ నిర్వహించింది. ఇందులో విశాఖ నగరానికి చెందిన కె.పి.లిపికారెడ్డి కూచిపూడి నృత్య విభాగంలో 'బి హైగ్రేడ్ కళాకారిణి'గా ఎంపికైంది. ఈ సందర్భంగా విశాఖ ఎంపీ శ్రీభరత్ హర్షం వ్యక్తం చేసి, ఆమెకు అభినందనలు తెలిపారు. లిపికారెడ్డి ఇప్పటి వరకు దేశ విదేశాల్లో 2,000కు పైగా నాట్య ప్రదర్శలు చేసి.. జాతీయ, రాష్ట్ర, జిల్లా స్థాయిలో 150కు పైగా పురస్కారాలు, సత్కారాలు పొందారు. ఈమె ఇప్పటి వరకు దేశంలోని 300కు పైగా ప్రముఖ దేవాలయల్లో కూచిపూడి నాట్య ప్రదర్శనలు చేశారు. లిపికారెడ్డి తలపెట్టిన అష్టోత్తర శత నృత్య సంగీతార్చన పేరిట దేశంలోని 108 శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానాల్లో నృత్య సంగీత ప్రదర్శనలో భాగంగా ఇప్పటి వరకు 38 ప్రదర్శనలు పూర్తి చేశారు.